క్లుప్తంగా

హోటల్ యజమానికి రూ.2వేల జరిమానా



జరిమానా వేస్తున్న ఎంపీడీవో, కార్యదర్శి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బ్రిడ్జి వద్ద రోడ్డు పక్కన వ్యర్థాలు వేసిన హోటల్ యజమానికి ఎంపీడీవో బషీరొద్దీన్, కార్యదర్శి నర్సయ్య రూ. 2వేల జరిమానా వేశారు. తడి, పొడి చెత్త కంపోస్టు షెడ్డులో వేయకుండా కేశవపట్నంలోని ఓ మెస్ యజమాని, సిబ్బంది రోడ్డు పక్కన వేస్తున్నారు. దుర్వాసన వస్తోందని ఎంపీడీవో ఆకస్మికంగా బ్రిడ్జి ప్రాంతంలో శనివారం తనిఖీ చేపట్టారు. వ్యర్థాలను వేస్తుండగా పట్టుకున్నారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్ శనివారం ప్రకటనలో కోరారు. పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం 23న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నామని తెలిపారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఆదర్శం

వీణవంక: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోందని, సీఎం కేసీఆర్ చొరవతో ఎంతోమంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న కేసీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేదంటే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న వెంకట్‌ప్రకాశ్

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి అనుబంధ గ్రామం చౌదరిపల్లిలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి కరీంనగర్ పట్టణంలోని మయూరి ఫ్యాన్సీ స్టోర్ యజమాని చిరంజి పద్మవెంకట్‌ప్రకాశ్ శనివారం రూ. 12,116 విరాళం అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమిరిశెట్టి సుధాకర్, మాజీ ఎంపీటీసీ దొబ్బల మధు, నాయకులు పూదరి సంపత్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై వరినాటు వేసి బీజేపీ నాయకుల నిరసన



బురదలో నాటు వేస్తున్న బీజేపీ నాయకుల

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్–వేగురుపల్లి రోడ్డు ఇసుక ట్రాక్టర్లు, లారీలతో గుంతలమయంగా తయారైంది. ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారని, బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ, మండల ఇన్‌చార్జీలు గడ్డం నాగరాజు, రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో నాయకులు శని వారం రోడ్డుపై వరినాటు వేసి నిరసన తెలిపారు. నాయకులు, అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, ప్రజల గోడును పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం తక్షణం రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణాచారి, శ్రీహరి, రమేశ్ పటేల్, గణేష్, కిరణ్, కొమురయ్య, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు–బైక్ ఢీ: ఒకరికి గాయాలు



రోడ్డు కిందికి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం బైక్–కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ చెందిన వ్యక్తి కరీంనగర్‌కు బైక్‌పై వెళ్తుండగా కరీంనగర్ నుంచి హన్మకొండ వెళ్తున్న కారు ఢీకొని రోడ్డుకిందికి దూసుకెళ్లింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి గాయాలపాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని కేశవపట్నం బ్లూకోల్ట్స్ పోలీసులు పరిశీలించారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా..



రంగపేట శివారులోని నీటికుంటకు జలకళ

- అనువైన స్థలాల్లో నీటి కుంటలు ఏర్పాటు
- వర్షపు నీటితో కుంటలకు జలకళ
- జీవరాశులకు నీటి వసతి
- సత్ఫలితాలకు ఆస్కారం

మానకొండూర్: వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఏర్పాటు చేసిన నీటి కుంటలు ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలకళ సంతరించుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని గుట్టలు, గుట్టల బోర్లు, వరద ప్రవాహ ప్రాంతాలను గుర్తించి అధికారులు, వర్షపు నీరు వృథాకాకుండా ఎక్కడికక్కడే అడ్డుకట్ట వేసి నీటిని ఇంకించి భూగర్భ జలాలు పెంపు కోసం ఈ కుంటలను నిర్మించారు. కుంటల నిర్మాణాలతో కూలీలకు పనిదొరకడమే కాకుండా ఇటు రైతన్నలతో పాటు జీవరాశులకు తాగునీరు అందనుంది. కుంటల ఏర్పాటుతో బహుళ ప్రయోజనాలు కలుగనుండటంతో గ్రామస్తులు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు

గ్రామీణ ప్రాంతాలలోని ఒర్రెలు, గుట్టలు, చిన్నపాటి గుట్ట బోర్లు, వరద ప్రవాహ ప్రాంతాలను గుర్తించిన అధికారులు వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా ఉపాధిహామీ కూలీలతో నీటి కుంటలను తీయించారు. ఒక్కో నీటికుంట ఏర్పాటుకు రూ మూడు లక్షల వరకూ కూలీలకు చెల్లించారు. వరద ప్రవాహ ప్రాంతాల్లో వర్షపు నీరు కిందికి వెళ్లకుండా అక్కడే ఆగేట్టు, అడ్డుకట్ట వేయడంతో అనేక ప్రయోజనాలు చేకరునున్నాయి. ఇవే కాకుండా గతంలో ఉన్న చిన్నపాటి కుంటల్లో మట్టి తీసి, నీటి కుంటలుగా మార్చారు. ఆ కుంటలకు సంబంధించి మరమ్మతు పనులు చేశారు. కుంటలు నిండితే నీటిని ఒడిసిపట్టినట్టే.

నీటి కొరత ఉండదు



నీటి కుంటలతో చాలా మేలు జరుగుతుంది. వర్షపు నీరు వృథా కాదు భవిష్యత్‌లో నీటి కొరత ఉండదు. నీటి కుంటల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరుగుతాయి. సమస్త జీవరాశులకు లబ్ధి చేకూరుతుంది. కుంట కట్టలపై పండ్ల మొక్కలు నాటితే పక్షులకు, కోతులకు ఆహారం అందుతుంది.

– దివ్యదర్శన్‌రావు, ఎంపీడీవో

ఉపయోగాలు

- ప్రభుత్వ స్థలాల్లో కుంటల ఏర్పాటుతో భూ ఆక్రమణలు జరగకుండా నిరోధించడం
- భూగర్భజలాలు పెరిగితే రైతులకు అనుకూలం.
- వన్యప్రాణులకు తాగునీటి వసతి
- కుంటల ఏర్పాటుతో కూలీలకు పని.
- కుంట కట్టలపై మొక్కలు పెంచడం

జీపీ కార్మికుల వినూత్న నిరసన



మానకొండూర్‌రూరల్: చెవిలో పువ్వుతో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు



గన్నేరువరంలో కాంగ్రెస్ నాయకుల సంఘీభావం

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట 17 రోజులుగా జీపీ కార్మికులు చేస్తున్నారు. శనివారం చెవిలో పువ్వుతో నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో అంజయ్య, శ్రీనివాస్, రాజుకుమార్, సంపత్, శ్రీధర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాతంగి అనిల్, మాంగరపు అనిల్, ముడికే అజయ్, రాపోలు హరీశ్ పాల్గొన్నారు.



రామడుగు: మాట్లాడుతున్న నాగి శేఖర్

రామడుగు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెకు మద్దతు పలికారు. కార్యక్రమంలో నాయకులు పల్నాటి చంద్రయ్య, నగేశ్, రవీందర్, సీఐటీయూ అధ్యక్షుడు లంక కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ సనాజవేరియా

జమ్మికుంట: ఆరోగ్య ఉపకేంద్రాల్లోని సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వావిలాల పీహెచ్‌సీ వైద్యులు సనాజవేరియా అన్నారు. శనివారం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు డ్రై డే, ఫీవర్ సర్వేలు చేపట్టాలని, వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, ర్యాపిడ్ రెస్పాన్స్ టీం పర్యవేక్షించాలని, గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో మెడికల్ క్యాంపులు, పల్లె దవాఖానాలో వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్స్ అపర్ణ, సంధ్యారాణి, మహోన్నత, సూపర్‌వైజర్స్ రత్నకుమారి, అరుణ, స్వరూప, సదానందం ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా సంక్షేమ హాస్టళ్లు



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

జమ్మికుంట: సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని, హాస్టల్‌లో ఖాళీగా ఉన్న కమాటి, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వర్షాకాలంలో శుభ్రమైన మంచినీరు, భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమలు వృద్ధిచెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు నోటబుక్స్, దుప్పట్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షం

- ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షంగా ఎల్లవేళలా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బిజిగిరిషరీఫ్ క్లస్టర్ రైతువేదికలో వివిధ గ్రామాల రైతులతో ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సమావేశం నిర్వహించారు. మూడు గంటల కరెంట్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం కావాలా, మూడు పంటలకు ఇరవైనాలుగు గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్, సర్పంచులు, ఎంపీటీసీ మమత, పీఏసీఎస్ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, రైతు సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఒక్క చాన్స్ ఇవ్వాలని కౌశిక్ రెడ్డి కోరారు. మండలం లోని సిరిసేడు క్లస్టర్ రైతువేదికలో ఆయా గ్రామాల రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతన్నలు కరెంట్ కోసం వ్యవసాయబావుల దగ్గర పడిగాపులుగాశారని. మళ్లీ ఆరోజులు రావాలని ఎవరు కోరుకుంటారని అన్నారు. రైతుల కోసం అహర్నిశలు ఆలోచించే వ్యక్తి సీఎం కేసీఆర్ అని, సోషల్ మీడియాలో తన మాటలను వక్రీకరించి వైరల్ చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, దేశిని కోటి, సర్పంచులు రఫీ ఖాన్, జిల్లెల తిరుపతి రెడ్డి, రాజమల్లయ్య, రాజిరెడ్డి, ఎంపీటీసీలు ఎక్కేటి సంజీవరెడ్డి, చిన్నరాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశవపట్నంలో డ్రంకెన్‌డ్రైవ్



డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్న సీఐ సంతోష్

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం రాత్రి హుజూరాబాద్‌రూరల్ సీఐ సంతోష్ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. కరీంనగర్ –వరంగల్ జాతీయ రహదారిపై మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. వెంట ఇన్‌చార్జి ఎస్సై సురేందర్, ఏఎస్సై మల్లారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ లతీఫ్, సిబ్బంది ఉన్నారు.

బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు



తిమ్మాపూర్: కేక్ కట్‌చేస్తున్న ఎంపీపీ కేతిరెడ్డి వనిత

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని మండలాల్లో శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా అభివృద్ధి కోసం వినోద్‌కుమార్ చేస్తున్న కృషిని కొనియాడారు. జమ్మికుంట పట్టణంలోని స్పందన అనాథ ఆశ్రమంలో జన్మదిన వేడుకలు నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ శివారులోని ప్రశాంత్ భవన్‌లో అనాథ పిల్లలకు పండ్లు, బియ్యం, కోడిగుడ్లు, చికెన్, నూనె, బ్రెడ్ అందజేశారు. తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వాసుపత్రికి వైద్యులను కేటాయించాలి



మాట్లాడుతున్న సతీశ్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదని సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు దండిగారి సతీశ్ ఆరోపించారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని రూ. కోట్లతో నిర్మించిన ఆసుపత్రికి ప్రభుత్వం సరిపడా వైద్యులను కేటాయించడం లేదని, వైద్య సిబ్బంది పేషెంట్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో బిజిగిరి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి సమస్యలు విన్నవించిన నాయకులు



మానకొండూర్: ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

మానకొండూర్: మండలంలో నెలకొన్న సమస్యలను బీజేపీ నాయకులు ఎంపీ బండి సంజయ్‌కుమార్ దృష్టికి శనివారం తీసుకెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి, ఎంపీటీసీ రంగు భాస్కరాచారి, బీసీ సెల్ నాయకుడు మియాపురం లక్ష్మణాచారి, దూలం కిరణ్ పలువురు నాయకులు రహదారులు, డబుల్ బెడ్రూం, దళితబంధు, రుణమాఫీ అంశాలను ఎంపీ వద్ద ప్రస్తావించారు.

జమ్మికుంట: మండలంలోని బీజేపీ నాయకులు కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చొరవతీసుకోవాలనే విషయమై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, మండల అధ్యక్షుడు సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి రామిడి సురేందర్, పూల్లూరి ఈశ్వర్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కైలాస కోటి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అజయ్‌వర్మను పరామర్శించిన ఎంపీ

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన సొల్లు అజయ్‌వర్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ శనివారం ఆయనను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వెంట తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ నాయకుడు దరువు ఎల్లన్న, వైద్యులు పుల్లెల పవన్‌కుమార్, కొంకటి అనిల్, తదితరులు ఉన్నారు.

జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం



గన్నేరువరంలో జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవంలో లయన్స్ సభ్యులు

గన్నేరువరం: మండల కేంద్రంలో శనివారం జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 1947 జూలై 22న పింగళి వెంకయ్య జాతీయ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా కార్యక్రమం చేపట్టామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవి, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారిప్రభాకర్, బొడ్డు సునీల్, బూర శ్రీనివాస్, డిస్ట్రిక్ మెట్రో కేబినేట్ సభ్యులు వెంకన్న, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, భాస్కర్, దామోదర్, లింగారెడ్డి, బాలయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

‘మణిపూర్’ దోషులను శిక్షించాలి



శంకరపట్నం: మాట్లాడుతున్న అభిలాశ్



జమ్మికుంటలో నిరసన

జమ్మికుంట: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, ప్రజా సంఘాల నాయకులు గుంటి సామ్రాజ్యం డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద ప్రజా సంఘాలు, మానవ హక్కుల వేదిక, ఉపాధ్యాయ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కేంద్రంతోపాటు మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండించారు. సామూహిక అత్యాచారం, హత్యలు జరుగుతున్నాయని, స్త్రీలకు రక్షణ కల్పించకపోవడం సిగ్గు చేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతోనే అల్లర్లు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాలు, మానవ హక్కుల వేదిక నాయకులు మోహన్, రాజశేఖర్,అనిల్, సజ్జు, అడ్వకేట్ భార్గవి, డీటీఎఫ్ నాయకులు నరహరి, వేణు, అమృత కిషోర్ , టీపీటీఎఫ్ నాయకులు కొండపాక తిరుపతి, అవినాష్, రమాదేవి, సంపత్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ సంఘాల మండల అధ్యక్షుడు బొంగోని అభిలాశ్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో మాట్లాడారు. ప్రజాసంఘాలు ఏకమై ఖండించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రశాంత్, శ్రవణ్, సాగర్, మణిసాయి, అక్షయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న సొల్లు బాబు



నియామకపత్రం అందుకుంటున్న కనకయ్య

హుజూరాబాద్: కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నియోజకవర్గానికి ఏం చేశారో సమాధానం చెప్పాలని, రాజకీయ ఉనికి కోసం మాట్లాడుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ అప్సర్, ఆడెపు ఐలయ్య, చాందుపాషా పాల్గొన్నారు.

తిమ్మాపూర్: కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధికార ప్రతినిధిగా గూడ కనకయ్య నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లా కార్యాలయంలో నియామకపత్రం అందించారు. కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌కు చెందిన కనకయ్య సేవలను గుర్తించి మండల అధికార ప్రతినిధిగా నియమించామని డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడికి కనకయ్య కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లిలో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య శనివారం ప్రారంభించారు.

రోడ్డు నిర్మించాలని రాస్తారోకో

చొప్పదండి: ఆర్నకొండ నుంచి గంటలపల్లి వరకు తారురోడ్డు వేయాలని డిమాండ్‌చేస్తు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేశారు. పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం రోడ్డుపై బైఠాయించారు. తహసీల్దార్ అంబటి రజిత ఆందోళనను విరమింపజేశారు.

మత్తడి దూకిన కుడిచెరువు

చొప్పదండి: పట్టణంలోని కుడి చెరువు శనివారం మత్తడి దూకింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులోకి భారీగా నీరు చేరింది.

సందర్శకులతో కిటకిట

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ వారం రోజులుగా సందర్శకులతో కిటకిటలాడింది. బాహుబలి మోటార్లతో నీటిని పంపు చేస్తుండటంతో కరీంనగర్ జిల్లాలోని పలు మండలాలకు చెందినవారు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి జల దృశ్యాలను ఆనందిస్తున్నారు. రెండు రోజులుగా పంపింగ్ నిలిపివేయడంతో సందర్శకుల తాకిడి కొంతతగ్గింది.